


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 103 మంగళవారం 15-04-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## తెలుగు రాష్ట్రాల్లో రక్తమోడిన రోడ్లు

**వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి**

**కడప జిల్లాలో ముగ్గురు..ం**

**జనగామ జిల్లాలో ముగ్గురు దుర్మరణం**




జనగామ/కడప,ఏప్రిల్14: తెలుగు రాష్ట్రాల్లో రోడ్లు రక్తమోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒంటిమిట్ట నడింపల్లి వద్ద జీపు అతివేగంగా వచ్చి.. ఆర్టీసీ బస్సుతో పాటు పోలీస్ వాహనాన్ని ఢ కోట్టింది. ప్రమాదంలో జీపులో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఘటన స్థలంలోనే మృతి చెందారు. మూడు వాహనాలు ఢీ కొని ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి వైపు నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన స్కార్పియో వాహనం.. ఆర్టీసీ బస్సు, పోలీసు రక్షక వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో స్కార్పియోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను నంద్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వారిగా గుర్తించారు. పోలీసు వాహనంలో ఉన్న కానిస్టేబుల్ రఘునాథరెడ్డితోపాటు- డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కడప రిమ్స్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. స్కార్పియో వాహనం నుజ్జునుజ్జయింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఒంటిమిట్ట, రాజంపేటకు చెందిన పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు.

## పర్యావరణ విధ్వంసంలో కాంగ్రెస్ బిజీ..

**మేం రక్షణకు పాటు పడుతుంటే...వారు ధ్వంసం చేస్తున్నారు**

**హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూములపై ప్రధాని విమర్శలు**

**అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అడుగడుగునా అవమానించింది**

**వక్ఫ్ చట్టాన్ని దుర్వినియోగం చేసిన కాంగ్రెస్**

**హిస్సార్ విమానాశ్రయం ప్రారంభంలో ప్రధాని మోడీ**

**చండీఘడ్,ఏప్రిల్14:** అడవులపై బుల్డోజర్లు నడిపించడంలో తెలంగాణ ప్రభుత్వం బిజీగా ఉందని ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. ప్రకృతిని ధ్వంసం చేస్తూ వన్యప్రాణులను చంపుతున్నారని ప్రధాని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ప్రధాని మోదీ మండిపడ్డారు. హర్యానా రాష్ట్రంలో హిసార్ ఎయిర్‌పోర్టుని ప్రధాని మోదీ ప్రారంభించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకున్నారు. హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. తెలంగాణలో అటవీ సంపదను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానం మనం ఎప్పటికీ మర్చిపోకూడదని ప్రధాని మోదీ అన్నారు. అంబేద్కర్ జీవించి ఉన్నప్పుడు, ఆ పార్టీ ఆయన్ను పదే పదే అవమానించిందని మండిపడ్డారు. రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయేలా చేసిందని ఆగ్రహించారు. వ్యవస్థ నుంచి ఆయన్ను దూరంగా ఉంచేందుకు కుట్రలు చేసిందని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ మరణం తర్వాత, ఆయన జ్ఞాపకాలను తుడిచిపెట్టడానికి ప్రయత్నించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బాబాసాహెబ్ సమానత్వం కోసం నిలబడ్డారని, కానీ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఓటు



బ్యాంకు రాజకీయాల వైరస్‌ను వ్యాప్తి చేసిందని ఆరోపించారు. అందుకే వక్ఫ్ సవరణ చట్టం-2025ను వ్యతిరేకిస్తూ మత ఛాందసాన్ని పెంచి పోషిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీలను రెండో తరగతి పౌరులుగా మార్చారని ప్రధాని మోదీ ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు ఎస్సీ, ఎస్టీ, బీసీల వర్గాలకు చేరాయో లేదో తెలుసుకునే విషయాన్ని సైతం కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారం పొందేందుకు రాజ్యాంగాన్ని ఓ ఆయుధంగా కాంగ్రెస్ మార్చిందని ధ్వజమెత్తారు.

## మా కుటుంబం కోరుకుంటే రాజకీయ అరంగ్రేట్రం

**మనసులో మాట బయటపెట్టిన రాబర్ట్ వాద్రా**



**న్యూఢిల్లీ,ఏప్రిల్14:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయ ప్రవేశం తర్వాత ఇప్పుడు ఆమె భర్త రాబర్డ్ వాద్రా రాజకీయ అరంగేట్రానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కోరితే రాజకీయాల్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. రాజకీయాల్లో ఉండాలని పార్టీ భావిస్తే కుటుంబ ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి అడుగుపెడతానని చెప్పారు. గాంధీ కుటుంబంలో తాను సభ్యుడిని కావడం వల్లే ప్రతిసారి తనను రాజకీయాల్లోకి లాగుతున్నారని వాద్రా ఆరోపించారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా తన పేరు ఆ పార్టీలకు గుర్తు వస్తుందన్నారు. తన భార్య ప్రియాంక గాంధీ, బావ రాహుల్ గాంధీ వల్ల రాజకీయాలపై తనకు అవగాహన పెరిగిందన్నారు. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున సంస్థాగత మార్పులకు సిద్ధమవుతోంది. అహ్మదాబాద్‌లో ఇటీ-వల ముగిసిన సీడబ్ల్యూసీ సమావేశం, ఏఐసీసీ ప్లీనరీలో ఈ మేరకు చాలా స్పష్టమైన సందేశాలు ఇచ్చింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కీలక మార్పులకు కసరత్తు చేస్తోంది.






## ధరణి స్థానంలో భూభారతి

### ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లో అమలు

- జూన్ 2 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి
- సాంకేతిక సమస్యలు రాకుండా అధ్యయనం
- కొత్త పోర్టల్ ప్రారంభించిన సిఎం రేవంత్
- ధరణి ఓ పీడకల లాంటిదని సిఎం విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్14:** ధరణికి చెల్లుచీటీ పలికిన ప్రభుత్వం భూభారతి తసుకొచ్చింది. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శిల్పకళా వేదికగా సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భూభారతి' పోర్టల్ ప్రారంభమైంది. తొలుత ఈ కార్యక్రమాన్ని మూడు మండలాల్లో అమలు చేయనున్నారు. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ప్రజల నుంచి అవసరమైన సూచనలు స్వీకరించి, తగిన మార్పులు చేయాలని ఇప్పటికే రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రజల నుంచి వచ్చే స్పందన మేరకు ఈ పోర్టల్‌ను ఎప్పటికప్పుడు ఆధునీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్,మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మంత్రులు ఉత్తమ్,పొంగులేటి, పొన్నం,జూపల్లి ,మేయర్ గద్వాల విజయలక్ష్మి పలువురు నేతలు, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ మాట్లాతుతూ.. ధరణి రాష్ట్ర రైతులకు ఒక పీడ కల లాంటిదని అభివర్ణించారు. ధరణి పోర్టల్‌తోనే తహసీల్దార్‌పై పెట్రోల్ పోసి హత్య చేసే పరిస్థితి తలెత్తిందన్నారు. గత 65 ఏండ్లుగా భూములకు సంబంధించిన వివరాలను రెవిన్యూ సిబ్బందే కాపాడారు.. కానీ గత బీఆర్ఎస్ పాలకులకు ధరణి వచ్చాకే రెవిన్యూ సిబ్బంది దొంగలుగా కనిపించారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ సిబ్బందిని దొంగలుగా చూపి వేలాది ఎకరాలను కొల్లగొట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన భూచట్టాలను ఉన్నఫళంగా తొలగించి.. ధరణి పోర్టల్ తీసుకొచ్చారని.. ధరణితో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి అన్ని వివరాలను పొందుపరిచిందని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూభారతి చట్టాన్ని 69 లక్షల కుటుంబాలకు అంకితం చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 100 ఏళ్లు భూముల కోసమే పోరాటం జరిగిందని.. నిజాంకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పోరాటం చేశారని గుర్తు చేశారు. పాదయాత్ర సమయంలో రాష్ట్రంలోని భూసమస్యలు తెలుసుకున్నానని.. అప్పుడే ధరణి స్థానంలో కొత్త వ్యవస్థ తీసుకురావాలని నిర్ణయించుకున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం వచ్చాక ధరణిని బంగళాఖాతంలో వేస్తామని అనాడే చెప్పాం.. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను తీసేసి దాని స్థానంలో భూభారతి తీసుకొచ్చామన్నారు. వివిధ రాష్ట్రాల్లో భూచట్టాలను పరిశీలించాకే భూభారతి చట్టం రూపొందించామని తెలిపారు. అన్ని వర్గాల నుంచి సలహాలు తీసుకున్నాకే దీనిని ప్రారంభించామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా 4 మండలాలను తీసుకున్నామన్నారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే రెవెన్యూ సిబ్బంది ముఖ్యం. రెవెన్యూ సిబ్బందిని మా ప్రభుత్వం 100 శాతం నమ్ముతుందని పేర్కొన్నారు. తాము చేసే తప్పులకు రెవెన్యూ సిబ్బందిని బలి చేసే సంస్కృతికి మేం వ్యతిరేకమని స్పష్టం చేశారు. గత సీఎం కేసీఆర్ రెవెన్యూ శాఖను ఎలా దూషించారో చూశాం. ఎలుక దూరిందని ఇల్లు తగలబెట్టే వ్యవహారం చేశారు. కానీ రెవెన్యూ సిబ్బంది ఆత్మగౌరవమే మా ఆత్మగౌరవమని అన్నారు. 69 లక్షల మందికి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ శాఖ రెండు కళ్లలాంటివన్నారు.

## చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ

**సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి**



**సూర్యాపేట,ఏప్రిల్14:** చరిత్రలో నిలిచిపోయేలా బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. రజతోత్సవ సన్నాహక సభను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు జగదీశ్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న సభకు తరలివెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయని అన్నారు. కేసీఆర్ స్పీచ్ కోసం ప్రజలంతా ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వైఫల్యం చెందిందని జగదీశ్ రెడ్డి అన్నారు. నెరవేర్చలేని హామీలతో కాంగ్రెస్ అభాసుపాలైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై అన్ని రంగాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని తెలిపారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదు.. రైతు బీమా లేదు.. రుణమాఫీ పూర్తి కాలేదని.. ఆసరా ఫించన్లు పెంచలేదని.. ఉన్న పింఛన్లు సమయానికి ఇస్తలేరని విమర్శించారు. ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులు ఎత్తేసే దుస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలకు మోసపోయి ప్రజలు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కంచెగచ్చిబౌలి భూముల వివాదం

**సుప్రీంలో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు**




**న్యూఢిల్లీ,ఏప్రిల్14:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలి భూములు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతున్న వేళ ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రధాని మోడీ కూడా తాజాగా విమర్శలుచేశారు.ఈ భూములపై ఏప్రిల్ 16వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వ భూములేనని ఆ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. ఈ భూముల్లోనే సెంట్రల్ యూనివర్శిటీ-, మరికొన్ని ఇనిస్టిట్యూట్‌లు, బస్ స్టాండులు తదితర సౌకర్యాలు ఎన్నో వచ్చాయని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం సోదాహరణగా వివరించింది. సుమారు 20 ఏళ్లకుపైగా 400 ఎకరాల స్థలం న్యాయ వివాదంలో ఉన్నందున అక్కడ చెట్లు- మొలిచి.. అటవీ ప్రాంతంగా మారిందని ఈ అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వివాదాస్పదం కావడంతో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమార్ గత రెండు రోజులుగా ఢిల్లీలోనే ఉండి. సీనియర్ న్యాయవాదలతో చర్చించి.. ఈ అఫిడవిట్‌ను సిద్దం చేశారు. సోమవారం దీనిని సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత జరిగింది. మరోవైపు ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వ ఖజానాలో నిధులు నిండుకొన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలిలోని దాదాపు 400 ఎకరాలు వేలం పాట నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది.

# భారత ఆర్చరీ అసోసియేషన్ సభ్యులుగా
# మానుకోట వాసి పుట్ట శంకరయ్య




**తొలి సమయం హైదరాబాద్ డెస్క్ ఏప్రిల్14:**
ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఎఐ) దేశంలో ఆర్చరీ అభివృద్ధి కోసం ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా తెలంగాణకు చెందిన మానుకోట జిల్లా వాసి పుట్ట శంకరయ్యను కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా నియమించింది. ఈ కమిటీలు మొత్తం ఆరుగురు సభ్యులు దేశవ్యాప్తంగా పర్యటనలు చేసి ఆర్చరీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన పుట్ట శంకరయ్య సార్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 1998 నుండి 2014 వరకు భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని ఆర్చరీఅభివృద్ధికి ఎంతో కృషి చేశారు. కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్లో గిరిజన క్రీడ అభివృద్ధి కోసం తన వంతు సహకారాన్ని అందించి వారి ఉన్నత స్థితికి దోహదపడ్డారు. అంతేకాక ఆర్చరీలో రాష్ట్ర స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ఎంతో మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. అంతేగాక ఐటిడిఏ క్రీడల అధికారిగా పనిచేయడంతో పాటు రాష్ట్రస్థాయిలో నీ అన్ని ఐటీడీఏలకు కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. పుట్ట శంకరయ్యను ఆర్చరీ అభివృద్ధి కమిటీలో చేర్చుకోవడం పట్ల ఉమ్మడి జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షులు సాదుల సారంగపాణి, డివైస్ సునీల్ రెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ ఫర్ బాబు, మానుకోట జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.



### అంబేద్కర్ ఘన నివాళులు తెలిపిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి



**తొలి సమయం తొర్రూరు ఏప్రిల్ 14**
సమాజ పరిరక్షణకు తన జీవితాన్నే అంకితం చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని, ఆయన ఆవిర్భావ దినాన్ని ఘనంగా నిర్వహించి డా. అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయనకు గాఢమైన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా హైదరాబాద్‌లో వారి నివాసంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సామాజిక సమానత్వం, న్యాయం, విద్యా అభివృద్ధి వంటి అంశాల్లో అంబేద్కర్ ప్రవేశపెట్టిన సిద్ధాంతాలు నేటికీ సమాజానికి ప్రేరణగా నిలుస్తున్నాయి. పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆయన కలల భారతదేశంగా తీర్చిదిద్దడం మా లక్ష్యం అని పేర్కొన్నారు. అదే విధంగా, ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహానేతలను గుర్తు చేసుకోవడం ఒకవైపు, వారి ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్చి ప్రజలకు మేలు చేసే విధంగా అమలు చేయడం మరోవైపు అవసరం. డా. అంబేద్కర్ గారి జీవితం ప్రతి నాయకుడికి మార్గదర్శకంగా ఉండాలి అని తెలిపారు.

## బిఆర్ఎస్ రజితోత్సవ సన్నాక సమావేశం

**మాజీ మంత్రి డిఎస్ రెడ్డి నాయక్**




**తొలి సమయం దంతాలపల్లి ఏప్రిల్ 14**
దంతాలపల్లి మండల కేంద్రంలో వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం 27వ తారీఖు జరుగు బిఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం ఏర్పాటుచేసి రజితోత్సవ పోస్టరు ఆవిష్కరణ చేయడం జరిగినది. సమావేశానికి మహబూబాబాద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మరియు మహబూబాబాద్ పార్లమెంట్ మాజీ సభ్యులు మాలోత్ కవిత డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డిఎస్ రెడ్యానాయక్ మహబూబాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి నాయిని శ్రీనివాస రెడ్డి నూకల గౌతం రెడ్డి ఓలాద్రి మల్లారెడ్డి వేణు, కిషోర్, కిషన్ నాయక్ అంకం సోమేశ్వర్ గుండ గాని యాకన్న రొయ్యల సురేష్ దర్శనాల వెంకన్న పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు




**తొలి సమయం దంతాలపల్లి ఏప్రిల్ 14**
దంతాలపల్లి మండలంలో వేములపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతకింది వెంకన్న గుమ్మడవెల్లి వెంకన్న బాబు గుమ్మడవెల్లి ఉప్పలయ్య పరిచయ తదితరులు పాల్గొన్నారు.

### వడ్స పట్టణం (మహారాష్ట్ర) అంబేద్కర్ దీక్షాస్థలిలోని అంబేద్కర్ జయంతి ఉత్సవంలో
## ఆదివాసి 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ
### - దీక్షా స్థలిలో చిరు దాన్యాలతో తయారు చేయబడ్డ లడ్డుల పంపిణీ




**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ ఏప్రిల్ 14:**
అంబేద్కర్ జన్మించిన రాష్ట్రం లో 134 వ జయంతి ఉత్సవంలో పాల్గొనడం అదృష్టంగా బావిస్తున్నాను అని కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ అన్నారు. మహారాష్ట్ర లోని వడ్స పట్టణం లోని అంబేద్కర్ దీక్షాస్థలి వద్ద వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలవేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త, కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూఅసమానతలు లేకుండా వెనుక బడ్డ వాళ్ళని దృష్టిలో పెట్టుకొని బడుగు బలహీనుల కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్స్ ఏర్పాటు చేసిన సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కారణజన్ములు అన్నారు. ఆయన ఎంతో దూర దృష్టితో అసమానతలు లేని ,వివక్షతలు లేని సమాజం కోసం రిజర్వేషన్స్ కల్పించారు అన్నారు.ఆయనే లేకుంటే పరిస్థితులు ఎలా ఉండేయో! అన్నారు. ఐదవ షెడ్యూల్ లోని ఆదివాసీలు ముప్పేట ఇబ్బందులు ఎదురుకోవడం వలన అడవుల్లో దొరికే సహజసిద్ధమైన ఆహార పదార్థాలకు దూరమయ్యారని అన్నారు. కొన్ని ఆదివాసి తెగలు చెంచులు, కోలాం, కొండ రెడ్డి లాంటి తెగలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఆవేదనపడ్డారు.. అందుకే తక్కువ ఖర్చుతో ఆదివాసీ తెగల పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు ఆరోగ్య కరమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా.. చిరుధాన్యాలు రాగులు కొర్రలు ఊదలు సామలు, అరికెలు మరియు ఇప్పపువ్వు తో కూడుకున్న లడ్డూలను ఆదివాసీలకు తక్కువ ఖర్చుతో ఉచితంగా సమకూర్చే ఒక యజ్ఞం లాంటి సేవా కార్యక్రమాన్ని తలపెట్టారు.. అందులో భాగంగా ఈరోజు అంబేద్కర్ దీక్షస్థలిలో ఈ లడ్డూలను జై భీమ్ బంధువులకు అందించి, ఈ ఆరోగ్యకరమైన ఆహారాన్ని మీరు కూడా పెద్ద ఎత్తున సమాజంలో అట్టడుగున ఉన్న వారికి అందించాలని, తద్వారా అంబేద్కర్ ఆశయాలను కొనసాగించే వారసులుగా నిలుస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దీక్ష స్థలి వద్ద జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు ఇర్ప వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉపాధ్యాయులు, తొలి సమయం దినపత్రిక ఎడిటర్ వి అయోధ్య రామయ్య, వై 7 న్యూస్ సీఈఓ పులిపాటి పాపారావు చుంచు సంతోష్,తదితరులు పాల్గొన్నారు.



## 10వ వార్డులో ఘనంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి
### అంబేద్కర్ ఆశయాలను సాధిద్దామని ప్రతిజ్ఞ



**తొలిసమయం, ఇల్లందు. ఏప్రిల్ 14**
అంబేద్కర్ అందరివాడు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప కొత్తగూడెం (అర్బన్): 134వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పదో వార్డు లోని అంబేద్కర్ చమన్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం అంబేద్కర్ చమన్ లో 10వ వార్డ్ మాజీ కౌన్సిలర్ మునిగడప పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు సావటి స్వామి లు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిన్నతనంలో అనుభవించిన అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం ఆయన పడ్డ కష్టమే భారత రాజ్యాంగం అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా కుల ,మత ,వర్గ, వైశాల్యాలు లేని సమాజం కోసం మానవులందరికీ సమాన హక్కులు కల్పించి, అందరికీ విద్యను అందించడం ద్వారానే అంటరానితనం నిర్మూలన జరుగు తున్నదని భావించిన గొప్ప దార్శనికుడని వారు కొనియాడారు .ఆయన భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అనేక సౌకర్యాలను కులం, మతం ,వర్గ బేధం లేకుండా అందరూ సమానంగా హక్కులను అనుభవిస్తున్నారు. అందుకే అంబేద్కర్ ఏ ఒక్క కులానికో ,ఏ ఒక్క మతానికో చెందిన వాడు కాదని ,అంబేద్కర్ అందరివాడు అని వారు పేర్కొన్నారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని, భారత రాజ్యాంగం యొక్క ఔనత్యాన్ని కాపాడుతామని ,భారత రాజ్యాంగ మూలాలను దెబ్బతీసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి ఐక్యమత్యంతో అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఈ రోజు నుండి కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ పూనారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గంటాడి కోటేశ్వరరావు, బయన ఈశ్వరయ్య ,శాఖ కార్యదర్శులు సూరి మేని జనార్ధన్ ,రావుల దాసు, ఎస్కే జలీల్, సత్యనారాయణ (కొండ) ఆర్ఎంపీ డాక్టర్ సబ్బాని సతీష్, మహిళలు మార్తమ్మ టీచర్ ఎన్ సరోజ, నాయకులు అజరయ్య ,కాంపల్లి దుర్గయ్య ,బానోత్ చందర్, సూరిమేని రామారావు ,తోగరు నరేందర్ ,సబ్బని పాపారావు ,బానోత్ శ్రీను, ఉప్పతల శ్రీను, గుంజ వెంకన్న ,గోపి, సలీం, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

### తొర్రూరు పట్టణ ప్రజలకు మంచినీటి సౌకర్యాలు అందించే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డిలకు పాలాభిషేకం

**తొలి సమయం తొర్రూరు ఏప్రిల్14**



తొర్రూరు పట్టణంలోని వెంకటాపురం రోడ్డులో ఉన్న మంచినీటి బావి గత ప్రభుత్వంలో నిరుపయోగంగా పడావు పడిన మంచినీటి బావిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు ఆ బావిని శుద్ధి చేయించి పట్టణ ప్రజలకు మంచినీటిని అందించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

### దళిత విమోచన సమితి రాష్ట్ర కార్యదర్శి బనాదీ మోజే ఆధ్వర్యంలో

# 134 వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**తొలిసమయం, ఇల్లందు, ఏప్రిల్,14**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపల్ పరిధిలోని జగదాంబ సెంటర్ కూలీల అడ్డాలో సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత విమోచన సమితి రాష్ట్ర కార్యదర్శి బనాతి మోజే ఆధ్వర్యంలో 134వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిఆర్ అంబేద్కర్ దళిత విమోచన సమితి రాష్ట్ర కార్యదర్శి బనాతి మోజేస్ మాట్లాడుతూ 1891 ఏప్రిల్ 14న ఇదే రోజున ఇదే తేదీన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ఒక మహర్ కుటుంబంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మించారని ఈయన జన్మదినాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ఈయన సేవలకు గుర్తుగా సెలవుదినంగా ప్రకటించి ఈయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని కార్యాలయాలకు ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో దేశమంతటా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో అన్ని విభాగాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ ఆయన గురించి ఆయన జీవితం గురించి ఆయన చేసిన సేవలను గురించి వివరించారు. అంబేద్కర్ చిన్నప్పుడు జీవించిన కాలంలో చాందస బ్రాహ్మణవాదులు జమీందారులు కుబేరులు అంటరాని వారిగా చూసేవారని, పాఠశాలలో అందరితో కలవనీయకుండా ఒక మూలకు కూర్చోబెట్టి చదువు చెప్పేవారిని తెలిపారు. బావిలో నీళ్లను తగనిచ్చేవారు కాదని, ఎడ్లబండ లో ఎక్కనిచ్చేవారు కాదని తెలిపారు. బిఆర్ అంబేద్కర్ను పాఠశాలకు పోనీయకుండా మార్గమధ్యంలో అవంతరాలు కల్పించి కొట్టే వారిని తిట్టేవారని, తెలిపారు. రైల్వే స్టేషన్లో రానిచ్చేవారు కాదని రైల్వేలో ఎక్కనిచ్చేవారు కాదని అన్నారు. ఆడవాళ్ళను అసలు చదువుకోనీయకుండా చేసేవారని, బ్రతకకుండా పనులు ఇచ్చేవారు కాదని తెలిపారు. అంబేద్కర్ కుటుంబాన్ని ఆయన తండ్రిని అంటరాని వారిగా చూసి వెలివేసినట్టుగా చూసే వారని తెలిపారు. అయినా కూడా బాల్యం నుండి బిఆర్ అంబేద్కర్ పాఠశాలలో జరిగే అన్యాయాన్ని ఎదిరించేవాడని, స్త్రీలు పురుషులు అందరూ చదివి హక్కు కావాలని పొట్లాడే వాడని, మంచినీళ్లు అందరికీ సమానమేనని అందరూ తాగడానికి హక్కు ఉందని పోరాడాడని తెలిపారు. బరోడా రాజు అంబేద్కర్ యొక్క చదువు తెలివితేటన్ని గ్రహించి విదేశాలలో చదువుకోవడానికి ఆర్థికంగా సాయపడ్డాడని తెలిపారు. ఆ విధంగా ఆరోజు చాందస అర్జున వర్ణాల బ్రాహ్మణవాదులు సమాజంలో అసమానాలను పెంచి పోషించేవారని అవన్నీ సహనంగా తట్టుకొని వారిపై పోరాడుతూ తన తెలివితేటలతో స్వాతంత్ర పోరాటంలో తను ఒక శక్తిగా ఎదిగి బ్రిటిష్ వారిని ఎదిరించడమే కాకుండా భారత దేశంలోని రాజకీయ మేధావులలో ప్రఖ్యాత్రుడుగా పేరుగాంచి భారత రాజ్యాంగంను రచించిన ఒక గొప్ప మేధావిని తను అనుభవించినటువంటి కష్టాలను ఇతరులు అనుభవించరాదని భారత దేశంలో పుట్టిన స్త్రీలు పురుషులు అందరూ అన్ని హక్కులు కలిగి ఉన్నారని గ్రహించి అందరికీ సమాన హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచాడని, అన్ని కులాల వారికి హక్కులను కల్పించిన గొప్ప నేత అని మోజేష్ అన్నారు. భారతదేశ స్వతంత్ర అనంతరం భారతదేశానికి న్యాయశాఖ మంత్రిగా ఎన్నుకోబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భారత్ బిసి పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎలిమిశెట్టి వీరన్న, దేవ్లా, దాస్యం సురేంద్రబాబు, కంబాల శ్రీనివాసరావు, ఎస్బిఐ మాజీ మేనేజర్ ధనరాజ్, ఛానల్ చారి తదితరులు పాల్గొన్నారు.

# గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకున్న పోలీసులు




**తొలిసమయం, ఇల్లందు. ఏప్రిల్ 14**

భద్రాద్రి జిల్లా ఇల్లందు పోలీస్ స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో ఇల్లందు డిఎస్పీ చంద్రబాబు మాట్లాడుతూ.... ఈనెల 12వ తేదీన ఇల్లందు పట్టణ పరిధిలో జరిగిన ఒక చోరీకి సంబంధించి వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు నాలుగు బృందాలుగా ఇల్లందు, మణుగూరు, హైదరాబాదులలో మరోవైపు క్లూస్ టీం విచారణ చేయడం జరిగిందన్నారు. కాగా ఈరోజు ఇల్లందు పట్టణం బుగ్గవాగు వద్ద సిఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు... అనుమానా దస్పద స్థితిలో కనిపించిన వ్యక్తిని విచారించగా అంతర జిల్లా దొంగ కోరి రాహుల్గా గుర్తించారు ... అతని వద్ద నుండి 20 తులాల బంగారం మరియు 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు.. చోరీకి గురైన ఆభరణాలు ఎటువంటి మార్పులు ఏమీ తగ్గకుండా రికవరీ చేసిన తీరును జిల్లా ఎస్పీ రోహిత్ అభినందనలు తెలిపినట్టు వారికి రివార్డులు కూడా ప్రకటించినట్టు డిఎస్పి చంద్రభాను తెలిపారు. హైదరాబాద్ తుక్కుగూడ కు చెందిన రాహుల్ 8 కేసుల్లో నిందితుడని పోలీసులు తెలిపారు. దొంగతనం జరిగిన గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకున్న తీరుపై ఇల్లందు పోలీస్ సబ్ డివిజన్ సిబ్బందిని డి.ఎస్.పి అభినందించారు

### బడుగు బలహీన వర్గాల వారి అభివృద్ధి కోసం జీవితాన్ని

# త్యాగం చేసిన మహా వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

**పలుచోట్ల అంబేద్కర్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న మువ్వా, రాంరెడ్డి, మల్లిబాబు యాదవ్**




**తొలిసమయం, ఇల్లందు. ఏప్రిల్ 14**

భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో సోమవారం నాడు కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని అంబేద్కర్ సెంటర్, రాయ గూడెం బండిపాడు సాతాను గూడెం, పింజరమడుగు గ్రామాలలో ఘనంగా జరిగాయి. పలుచోట్ల జరిగిన ఈ కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి చైర్మన్ మువ్వా విజయబాబు, తెలంగాణ రాష్ట్ర అగ్రిటెక్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్ రెడ్డి , డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, పిఎసిఎస్ చైర్మన్, టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14వ తారీఖున అట్టడుగు వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించి, ఆనాటి బ్రిటిష్ వారు మత ఛాందసుల దుర్మార్గానికి అంటరాని వాడిగా వెలివేసినప్పటికీ దీక్షతో పట్టుదలతో దొంగ చాటుగా ఉండి, రాత్రిపూట వీధిలైట్లలో చదువుకొని, కొంతమంది దాతలు సహకారంతో ఇతర దేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదివి వచ్చి న్యాయవాదిగా, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేయడం జరిగింది. జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని స్వతంత్ర భారతంలో తొలి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని, తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశం మేరకు మన దేశానికి దిశా నిర్దేశం చేయడానికి రాజ్యాంగాన్ని రచించడానికి అవకాశం వచ్చింది. ఎన్నో రాజకీయ వేదికల మీద అట్టడుగు బడుగు బలహీన వర్గాల వారి దుస్థితిని గురించి అంటరానితనం గురించి అవమానాల గురించి, బలహీన వర్గాల వారి పై జరుగుతున్న అన్యాయాలను ప్రస్తావనకు తెచ్చి ఒకరకంగా బడుగు బలహీన వర్గాల తరఫున ఒక విప్లవవాదిగా, నిరంతరం కృషి చేసిన మహా వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వక్తలు కొనియాడారు. ఈరోజు బడుగు బలహీన వర్గాల వారు అనుభవించే రిజర్వేషన్లు ఆ మహానుభావుడు పెట్టిన భిక్షాన్ని చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. తాను రచించిన రాజ్యాంగాన్ని అనుసరించి ప్రపంచ దేశాలు కూడా అతని మార్గదర్శకం చేసుకుని రాజ్యాంగాలు తయారు చేయడం జరిగింది. ఈనాడు కొంతమంది రాజకీయ నాయకులు రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేయటం చాలా దుర్మార్గమని ఆరోపించారు. ప్రపంచ మార్గదర్శకుడుగా కూడా ప్రసిద్ధి ఎక్కాడు. అలాంటి వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవల్సిందిగా పిలుపునిచ్చారు.రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షుడు లాంటి పెద్ద అవకాశం కల్పించి, ఈనాటికీ బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతకు పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేస్తుందని వివరించారు. ఈరోజు నుండి ఎస్సీ వర్గీకరణ జరిపి భారతదేశంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గింజల నర్సిరెడ్డి, బానోత్ నరసింహ నాయక్, నీరుడు రమేష్, నీరుడు నరేష్, మోదుగు ఆనందరావు గుజ్జర్లపూడి రాంబాబు నల్లమోతు లక్ష్మయ్య, మోదుగు ప్రభాకర్ పుచ్చకాయల వెంకటేశ్వర్లు, దుగ్గిన్ని కృష్ణ, దమ్మాలపాటి సత్యం రాకేష్,శీలం పుల్లయ్య, భూక్య నాగేంద్రబాబు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, ఉబ్బని నాగార్జున, య లమద్దినరసింహారావు మామిళ్ల చిన్న నరసయ్య, నాగండ్ల పిచ్చయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, చల్ల మల్లయ్య, ఉబ్బని రాము ఉబ్బని ప్రసాదు పరిమిశెట్టి సాంబయ్య, చిన్నబోయిన సత్యం, వీరబాబు, కృష్ణ సత్తి చిట్టిబాబు, గుండ్ల వెంకన్న, బాబు, గోలు,వెంకట నరసయ్య, తురక దాసు తురక రవి మరియు తదితరులు పాల్గొన్నారు

### పెద్ద గూడూరు అంబేద్కర్ సెంటర్‌లో ఘనంగా అంబేద్కర్ 134 వ జయంతి

**- అంబేద్కర్ లేకుంటే బడుగులం ఏమైపోదుమో!**

**సామాజిక అధ్యయన వేదిక ఫౌండర్,ప్రభుత్వ ఉపాధ్యాయులు పార్నంది రామయ్య**



**తొలి సమయం మహబూబాబాద్ ఏప్రిల్ 14:**

అంబేద్కర్ లేకుంటే బడుగుల బ్రతుకులు ఏమై పోయేవో, ఊహించుకుంటేనే భయమేస్తుంది అని సామాజిక అధ్యయన వేదిక ఫౌండర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు పార్నంది అన్నారు పెద్ద గూడూరు మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ 134వ జయంతి ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కత్తి స్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు

### డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు టిజిఆర్‌టిసి డిపో మేనేజర్ ఘన నివాళులు



**తొలి సమయం తొర్రూరు ఏప్రిల్ 14**

తొర్రూరు టీజీ ఆర్టీసీ డిపో మేనేజర్ వి పద్మావతి మరియు ఆర్టీసీ స్టాఫ్ మరియు ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ వెల్ఫేర్ తరఫున ఏర్పాటుచేసిన మరియు బస్టాండ్ సెంటర్ దగ్గర ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటాలను పూలతో అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలు కన్న సమ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరికీ అవసరమైన హక్కులు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆమె అన్నారు.వారు నిర్మించిన రాజ్యాంగ తత్వాలను ఆధారంగా చేసుకుని అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు అంబేద్కర్ ఆశయాల అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నూతన అధ్యాయనానికి నాంది పలకాలి ఈ సందర్భచేశా టి జీ ఆర్టీసీ డిపో మేనేజర్ కండక్టర్లు స్టాప్ అందరు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అంబేద్కర్ ఆశయ సాధన కృషి చేస్తామని ప్రతిజ్ఞచేశారు.

### ఇల్లందు పట్టణ శాఖ ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలు

**తొలిసమయం, ఇల్లందు. ఏప్రిల్, 14**



భారత రత్న అంబేద్కర్ 134 వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఇల్లందు పట్టణ శాఖ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు...ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సంజీవరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాధవ్, జిల్లా ఉపాధ్యక్షులు నాయక్, జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేష్, జిల్లా కార్య వర్గ సభ్యులు సుచిత్ర,సీనియర్ నాయకులు మిర్యాల వెంకటేశ్వర్లు, రామయ్య ,పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాజ్ కుమార్ పాసి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అంబేద్కర్ జయంతి

**తొలిసమయం, ఇల్లందు. ఏప్రిల్ 14**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో వివిధ పార్టీల ఆధ్వర్యంలో వేరువేరుగా అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బి ఆర్ ఎస్, కాంగ్రెస్ వివిధ కుల సంఘాలతో పాటు జర్నలిస్టుల ఆధ్వర్యంలో అంబేద్కర్ కు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరకు కనకయ్య మాట్లాడుతూ డాక్టర్ బి అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అనే కొనియాడారు బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరువ రానిదని తెలిపారు. రాజ్యాంగం రచనలు తన పాత్ర కీలకమైందని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తాను ఎంతో పాటు పడ్డాడని అన్నారు. రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ల వల్లనే ఇవాళ తాను ఎమ్మెల్యేగా నిలబడడం జరిగిందన్నారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలలో సైతం నిరుపేదలకు మంచి అవకాశాలు కల్పించిన అంబేద్కర్ శిరస్మరణీయుడు అని అన్నారు. అంబేద్కర్ ఏ ఒక్క సామాజిక వర్గానికే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన వ్యక్తి అని అన్నారు. అందుకే ఈరోజు ప్రతి సామాజిక వర్గం ఆయనను ఘనంగా జయంతిని నిర్వహిస్తుందని తెలిపారు అదేవిధంగా ప్రభుత్వం కల్పించేటువంటి సంక్షేమ పథకాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ) పాఠశాలలో
# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**భావితరాలకు స్ఫూర్తి అంబేద్కర్**

**- డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్**

**విద్యార్థులు అంబేద్కర్ ఆశయాలను పాఠశాల**

**దశ నుంచే అర్థం చేసుకొని ఆ దిశగా నడవాలని పిలుపు!**

**అంబేద్కర్ తరతరాలకు గుర్తుండిపోయే సేవలను దేశానికి అందించారని ప్రశంసలు**




**తొలిసమయం నర్సంపేట ఏప్రిల్ 14 :**
అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన కృషిని మరువలేనిదని దీర్ఘదృష్టితో దేశ భవిష్యత్తును ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించి భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ కొనియాడారు.సోమవారం నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ సి.బి.యస్.ఈ పాఠశాలలో కరస్పాండెంట్ చింతల నరెందర్ ఆధ్వర్యంలో"భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఈ సందర్భంగా కరస్పాండెంట్ చింతల నరెందర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాతగా ఆయన తరతరాలకు గుర్తుండిపోయే సేవలను దేశానికి అందించారని ప్రశంసించారు.అంబేద్కర్ అంటరానివారుగా పరిగణించబడే పేద కుటుంబంలో పుట్టినా ఎదురుచూపులు కాచుకుంటూ ఎదిగి వచ్చారన్నారు. సాంఘిక పరమైన ఆర్థికపరమైన అవమానాలతో నిరంతరం పోరాడుతూ స్వయంకృషితో పైకి వచ్చారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ విదేశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసి జాతి గర్వించే స్థాయికి ఎదిగారని దళిత జాతి తలెత్తుకుని గౌరవంగా నిలిచేలా చేసిన డాక్టర్ అంబేద్కర్ ప్రాత:స్మరణీయుడని ఆయన చూపిన బాటలో, చేసిన బాసతో నిరంతరంగా ముందుకు సాగాలని విద్యార్థులు అంబేద్కర్ ఆశయాలను పాఠశాల దశ నుంచే అర్థం చేసుకొని ఆ దిశగా నడవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్, ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సి. హెచ్ రీటా,హెచ్. ఆర్. డి విజయలక్ష్మి, శశికల,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్ దారుణ హత్య

**హైదరాబాద్,ఏప్రిల్14:** హైదరాబాద్ పాతబస్తీలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతడిని నడిరోడ్డుపై కత్తులతో పొడిచి హత్యచేశారు. ఫలక్‌నుమా రౌడీ షీటర్ మసీయుద్దీన్‌ను గుర్తు తెలియని వ్యక్తి హత్యచేశారు. ఆదివారం రాత్రి రెయిన్ బజార్‌లో అతనిపై కత్తులతో దాడిచేసి చంపేశారు. అయితే పాత కక్షల కారణంగా అతడి ప్రత్యర్థులే యుద్దీన్‌ను హత్యచేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా, మసీయుద్దీన్‌కు మూడు రోజుల క్రితమే పెండ్లి అయినట్టు తెలుస్తున్నది.

# ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

**హామీ నిలబెట్టుకున్నందుకు స్థానికుల హర్షం**

**మంగళగిరి,ఏప్రిల్14:** మంత్రి నారా లోకేశ్ మరో హామీని నిలబెట్టుకొన్నారు. పాదయాత్రలో చెప్పినట్లుగా మంగళగిరి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఒక్కో హామీని నెరవేరుస్తున్నారని మంత్రిని అభినందించారు. చినకాకానిలో ఆయన ఆసుపత్రికి భూమి పూజ చేశారు. ఏడున్నర ఎకరాల్లో ఈ ఆసుపత్రిని నిర్మించ నున్నారు. అందుకోసం రూ. 52 కోట్లు ఖర్చు చేయనున్నారు. దేశంలోనే అత్యున్న స్థాయిలో ఈ ఆసుపత్రి ఉండాని లోకేశ్ ఆకాంక్షించారు. ఏడాదిలోపు ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రికి ధీటు-గా ఈ 100 పడకల ఆసుపత్రి ఉంటుందన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తి కోసం పోరాడుదాం

**జయంతి సందర్భంగా బాబు, లోకేశ్ నివాళి**

**అమరావతి,ఏప్రిల్14:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఆత్మగౌరవంతో, ఆత్మ విశ్వాసంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుందని అంబేద్కర్ అన్నారని స్మరించుకున్నారు. ఆ మహాశయుని వాక్కు స్ఫూర్తిగా బడుగు వర్గాల ఆత్మగౌరవాన్ని నిలపడానికి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి అంకితభావంతో మనందరం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కలలుగన్న సమసమాజాన్ని సాధించుకుందామని ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, స్వంతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా , స్వాతంత్రోద్యమ వీరుడిగా... ఆధునిక భారత సమాజ నిర్మాణానికి పునాదులు వేశారని గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహానుభావుని దేశసేవను స్మరించుకుందామని తెలిపారు. దళితాభ్యుదయానికి అందరం పునరంకితమవుదామని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహానీయునికి ఘన నివాళులు అర్పిస్తున్నానని ఏపీ విద్య, ఐటీ- శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. భారతీయ సమాజానికి డాక్టర్ అంబేద్కర్ సూచించిన మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయమైనదిగా నిలిచిపోతుందని చెప్పారు.

# తరచూ అగ్నిప్రమాదాలు

## ఆందోళనలో స్థానిక ప్రజలు

**అనకాపల్లి,ఏప్రిల్14:** అనకాపల్లి పరిసరాల్లో తరచూ అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. లోపభూయిష్టమైన పర్యవేక్షణతో అనకాపల్లి జిల్లాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల ఘటనలు మరవక ముందే అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆదివారం బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి ఎనిమిది మంది మృతి చెందడంతో ఒక్కసారిగా జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. 2015లో ఎస్.రాయవరం మండలం గోకులపాడులో ఏడుగురు, 2022లో సబ్బవరం మండలం చిన్నయాతపాలెంలో ముగ్గురు దుర్మరణం చెందారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రమాదాలు చోటు-చేసుకుంటున్నా ప్రమాద నివారణ చర్యలు, నియంత్రణ పద్ధతులు పాటించడం లేదు. బాణసంచా వ్యాపారం లాభసాటిగా ఉండడంతో కొంతమంది తయారీ కేంద్రాలకు అనుమతులు తీసుకుంటు-న్నారు. అయితే. అనుమతుల జారీకి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం కొట్టిచ్చినట్లు- కనబడుతోంది. రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, విద్యుత్ భద్రత వంటి పలు అంశాలను తరచూ పర్యవేక్షించాల్సి ఉంది. తమకున్న పలుకుబడితో అనుమతులు ఇవ్వడమే తప్ప, దాని నిర్వహణపై అధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదు. ఫలితంగా ప్రమాదాలు చోటు-చేసుకుంటు-న్నాయి. బాణసంచా తయారీలో పొటాషియం, నైట్రేట్, సల్ఫర్ వంటి పేలుడు లక్షణాలు ఉన్న రసాయనాలను వినియోగిస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వెంటిలేషన్ ఉండాలి. రసాయనాల మిశ్రమంలో సరైన శిక్షణ కార్మికులకు ఇవ్వకుండా పనిలో పెట్టు-కోవడం కూడా ప్రమాదాలకు దారి తీస్తోంది. అనకాపల్లి జిల్లాలోని కశింకోట, కొత్తకోట, రాంబిల్లి, యలమంచిలి, నర్సీపట్నం, ఎస్.రాయవరం, సబ్బవరం ప్రాంతాల్లో అనధికారికంగా బాణసంచా కేంద్రాలు నడుస్తున్నాయి. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులతో ఉన్న సంబంధాలతో వాటి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఊరికి దూరంగా పొలాలు, కొబ్బరి తోటల్లో షెడ్లు ఏర్పాటు-చేసుకొని ఈ తరహా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పేలుడు పదార్థాల చట్టం 1884 ప్రకారం రూపొందించిన నియమాలను నిర్వాహకులు పాటించడం లేదు. తయారీ లైసెన్సు, నిల్వ లైసెన్సు, విక్రయం, రవాణా వంటి లైసెన్సులు తీసుకోవాల్సి ఉన్నా ఆ నిబంధనలు పాటించకుండానే బాణసంచా వ్యాపారం సాగిస్తున్నారు. ఫార్మా పరిశ్రమల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. అచ్యుతాపురం సెజ్‌లోని వివిధ కంపెనీల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు కార్మికులు, విష్ణు కెమికల్‌లో ఒకరు, పరవాడలోని విశాఖ ఫార్మా సిటీ-లో శాంపిల్స్ సేకరిస్తుండగా ల్యాబ్ -టె-క్నీషియన్ మరణించారు. అనేక కంపెనీల్లో జరిగిన ప్రమాదాలతో ఇతర రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు గాయపడ్డారు. యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో ప్రమాదాల పాలయ్యారు.

# దేశ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర చిరస్మరణీయం

## నివాళి అర్పించిన మంత్రులు

**అమరావతి,ఏప్రిల్14:** భారత రాజ్యాంగ నిర్మాత బీ ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి మంత్రులు నివాళి అర్పించారు. రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాళులు అర్పించారు. భారత దేశ అగ్రగణ్య మేధావుల్లో బీఆర్ అంబేద్కర్ ఒకరని స్మరించుకున్నారు. ఆధునిక భారత దేశ నిర్మాణంలో ఆయనది చాలా కీలక పాత్ర అని గుర్తుచేసుకున్నారు. దేశంలోని పౌరులందరికీ సమానత్వం, గౌరవం కల్పించాలని పరితపించారని అన్నారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతం పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని తెలిపారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా గళమెత్తిన ఉద్యమకారుడని చెప్పారు. మహిళలు, కార్మికుల హక్కుల సాధన కోసం ముందుండి నడిచిన నేత అంబేద్కర్ అని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలు నేటికి కూడా ఎంతో ఆచరణీయమని ప్రశంసించారు. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి నివాళి అర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధనకు అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం, సమాజంలోని రుగ్మతలపై అంబేద్కర్ తన చివరి శ్వాస వరకు పోరాడారని తెలిపారు. రాజ్యాంగ ఫలాలతో బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. అంబేద్కర్ ది విగ్రహం కాదు దళితుల ఆత్మ గౌరవానికి చిహ్నమని కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని అన్నారు. పీ4తో రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసేందుకు చంద్రబాబు పాటు-పడుతున్నారని చెప్పారు. అంబేద్కర్ కలలు కన్న సమాజం కూటమి పాలనతోనే సాధ్యమని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఉద్ఘాటించారు.

# ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

**వర్గీకరణ అమలు చేస్తూ ఉత్తర్వులు**

**ఎన్నో ఏళ్ల పోరాటానికి చట్టబద్ధత వచ్చింది**

**మంత్రులతో కలసి ఉత్తర్వులు ఇచ్చిన సిఎం రేవంత్**



**హైదరాబాద్,ఏప్రిల్14:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుందని ప్రభుత్వం పేర్కొంది.. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం, మొత్తం 56 ఎస్సీ కులాలను మూడు విభాగాలుగా వర్గీకరించింది. మూడు గ్రూపులుగా విభజన, రిజర్వేషన్ల కేటాయింపు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రూప్-ఆ లో అత్యంత వెనుకబడిన కులాలకు 1 శాతం రిజర్వేషన్, గ్రూప్-ఇ లో మధ్యస్థ లబ్ధిదారులకు 9 శాతం రిజర్వేషన్, గ్రూప్- ఈలో మెరుగైన స్థితిలో ఉన్న కులాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ విధంగా మొత్తం 15 శాతం రిజర్వేషన్లను వర్గీకరించిన రూపంలోనే కొనసాగించనున్నారు. ఈ వర్గీకరణ సామాజిక న్యాయానికి, సమతా స్థాపనకు దోహదపడుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన పోరాటానికి నేడు చట్టబద్ధత లభించింది. ఇది బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగడంలో ముఖ్యమైన అడుగని అన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో పేదలకు మెరుగైన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే, ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత పథకాలపై ఆయన వివరించారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలకు ఎకరాకు రూ.12 వేలు ఆర్థిక భరోసాగా అందిస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించామని, భూమిపై హక్కుల కోసం భూభారతి పథకానికి శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ నిర్ణయాలు తెలంగాణలోని ఎస్సీ వర్గాలకు సామాజిక, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రగతిపథంలో ముందడుగు వేయడం అని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు

**మామడి,బొప్పాయి పంటలకు తీవ్రనష్టం**

**విజయవాడ,ఏప్రిల్14:** అకాల వర్షాలు పంటలను దెబ్బతీసాయి. అన్నదాతలు కోరుకోలేకుండా చేశాయి. అన్నదాతలకు అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వర్షాలు, వడగండ్ల వానకు భారీగా పంట నష్టం వాటిల్లింది. ఈదురుగాలతో కూడిన వర్షంతో పంటలు నేలరాలాయి. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రధానంగా మామిడి, బొబ్బాయి, మొక్కజొన్న పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు నియోజకవర్గంలో భారీ ఈదురు గాలులతో అకాల వర్షం పడటంతో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. పగలు ఎండ వేడి సాయంత్రం గాలి దుమ్ములతో ప్రజానీకం తీవ్ర అవస్థలు పడుతున్న పరిస్థితి. ఈదురు గాలులకు పలు చోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. తిరువూరు పట్టణంలో గాలులకు హోర్డింగ్‌లు, కరెంటు- స్థంబాలు నేలకొరిగాయి. తిరువూరు పట్టణంలో రాత్రి నుంచి కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి కురిసిన అకాల వర్షానికి తిరువూరు మార్కెట్ యార్డ్‌లో 1000కి పైగా ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. ఆరుగాలం కష్టంచి పండిన ధాన్యం తడవటంతో తీవ్ర నష్టం వాటిల్లింది అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో ఈదురు గాలుల బీభత్సం సృష్టించాయి. మామిడి, బొబ్బాయి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన మొక్కజొన్న, బొబ్బాయి,మామిడికాయలు నెలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101